# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం నమోదు చేసుకున్న 24 నుంచి 48 గంటల్లోపు అందిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
2. **కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**
3. **రాష్ట్రంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగణన కార్యక్రమం ఈరోజు నుంచి ప్రారంభమైంది.**
4. **భారత్, సింగపూర్ దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "సింబెక్స్- 2024" ద్వైపాక్షిక నౌకా దళ విన్యాసాలు ఈరోజు నుంచి విశాఖపట్నంలో జరుగుతున్నాయి.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈ నెల 27వ తేదీ ఈ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం నమోదు చేసుకున్న 24 నుంచి 48 గంటల్లోపు అందిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో ఒక సిలిండర్ నమోదుతో పాటు ఏ తేదీలో వస్తుందో కూడా సంక్షిప్త సమాచారం మొబైల్ ఫోన్‌కు అందుతుందని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లోనే సిలిండర్ అందించన్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 40 సెకన్లు )

---------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఈరోజు ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో కేంద్రమంత్రి మాట్లాడుతూ తిరుమలలో ఆగమ శాస్త్రానుసారం ఆలయ కైంకర్యాలు సాగుతున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం అమరావతికి 15వేల కోట్ల రూపాయలను, పోలవరంకు 1,220 కోట్లు మంజూరు చేసిందని కేంద్రమంత్రి పేర్కొంటూ ..

వాయిస్ (30 సెకన్లు)

---

రాష్ట్రంలో పశుగణన కార్యక్రమం ఈ రోజు నుంచి ప్రారంభమైందని రాష్ట్ర పశుసంవర్థకశాఖ కార్యదర్శి ఎం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా ఈ రోజు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశువులు, వ్యవసాయ పరికరాల వివరాలనూ ఇందులో నమోదు చేయనున్నారని తెలిపారు. పశుసంవర్థక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఈ గణన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి బోర్డు భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ఆధారంగా పశుగణన నిర్వహిస్తారని వివరించారు.

---

అమరావతి రైల్వే లైన్ ఏర్పాటు ద్వారా రాజధాని అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో రైల్వే లైను నిర్మాణానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలియచేయడం శుభపరిణామన్నారు.ఎర్రుపాలెం-అమరావతి - నంబూరు మధ్య రైల్వే లైన్ నిర్మించడం వల్ల రాజధానికి వచ్చే ప్రజలతో పాటు అమరావతి స్తూపం ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వర స్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టు సందర్శనకు అనువుగా ఉంటుందని అన్నారు. వాణిజ్యపరంగా, వ్యాపారపరంగా కూడా ఈ రైలు మార్గం రాష్ట్రాభివృద్ధికి క్రియాశీలకంగా మారనుందని తెలిపారు.

---

రబీ సీజన్ నుంచి రైతులు సాగు చేసిన పంటల బీమా కోసం జాతీయ పంటల బీమా పోర్టల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ తెలిపారు. రబీ పంటల బీమా అమలుపై జిల్లా వ్యవసాయ అధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల ద్వారా పంటల బీమా చేయించు కోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, పంటల వారీగా గడువు తేదీలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. పోర్టల్ ద్వారా రైతులే ప్రీమియం మొత్తాన్ని చెల్లించుకుని బీమా నగదును పొందాలన్నారు. సకాలంలో ప్రీమియం చెల్లించాలని, తద్వారా సీజన్‌లో ఏదైనా వైపరీత్యం వల్ల పంట నష్టం జరిగితే పరిహారం పొంద వచ్చునని సూచించారు.

---

అమరావతి రాజధాని పనులకు సంబంధించిన గత కాంట్రాక్టులన్నీ రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలుస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎర్రబాలెం నుంచి నంబూరు వరకు రైల్వే లైన్ నిర్మాణం అమరావతి అభివృద్ధికి దోహదపడనుందన్నారు. రహదారులు, సచివాలయ భవనాల నిర్మాణానికి డిసెంబరు నెలాఖరులోగా, శాసనసభ, హైకోర్టు నిర్మాణ పనులకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకు కొత్త టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు)

---

పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు  అందించాలని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ  కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. ఎచ్చెర్లలోని జిల్లా పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్‌కు ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులు  ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని అన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని,  నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు పటిష్టంగా గస్తీ నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు.

---------------------------

భారత్, సింగపూర్ దేశాల మధ్య మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ద్వైపాక్షిక నౌకా దళ విన్యాసాలకు విశాఖపట్నం  వేదికైంది. “సింబెక్స్– 2024”  పేరుతో తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విన్యాసాలు ఈ రోజు నుంచి వారం రోజుల పాటు విశాఖ సముద్ర జలాల్లో కొనసాగనున్నాయి.  ఈ కార్యక్రమంపై మా ఆకాశవాణి విశాఖపట్నం  ప్రతినిధి వి.యస్ మూర్తి మరింత సమాచారం అందిస్తారు.

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని  ప్రభుత్వాసుపత్రులకు ఔషధాలు, వైద్య సామగ్రిని  సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు.  రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ పనితీరు,. అతిసార వ్యాధి పరిస్థితులపై  నిపుణుల బృందం అందించిన  నివేదికపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలోనే అవసరాలకు తగినట్లుగా మందులు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విజయనగరం జిల్లా గుర్లలో నమోదైన అతిసార అదుపులోకి వచ్చిందని చెప్పారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా కేసుల నమోదు నేపథ్యంలో అక్కడ కూడా నివారణ చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

---------------------------

కళా రంగానికి కళాకారులు అందిస్తున్న సేవలను గుర్తించేందుకు ఈరోజు అంతర్జాతీయ కళాకారుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు.  ప్రముఖ స్పానిష్ చిత్రకారులు పాబ్లో రూయిజ్ పికాసో జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆధునిక చిత్ర కళ చరిత్రనే మలుపు తిప్పిన ఆయన 1881వ సంవత్సరం అక్టోబర్ 25వ తేదీన స్పెయిన్ దేశంలోని మలగా పట్టణంలో జన్మించారు. పికాసో ఒక చిత్రకారునిగానే కాకుండా శిల్పిగా, కవిగా, రంగస్థల అలంకరణ నిపుణునిగా, నాటక రచయితగా ప్రసిద్ధి చెందారు.

=====================